క్లుప్తంగా

ఘనంగా గ్రామదేవత పండగ

సీతంపేట: మండలంలోని శంభాం, దోనుబాయి గ్రామాల్లో గ్రామదేవతల పండగ ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పండగలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బుధవారం అనుపోత్సవంతో పండగ ముగుస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

గరుగుబిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.సూర్యనారాయణ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరవుతున్నారని, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం



మక్కువలో అవగాహన కల్పిస్తున్న కళాజాతా కళాకారుడు

మక్కువ: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఆడపిల్లలను ఉన్నతమైన చదువులు చదివించాలంటూ కళాజాతా కళాకారుల ఆధ్వర్యంలో భేటీబచావో, భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు మక్కువ మండలంలోని అనసభద్ర, శంబర, మార్కొండపుట్టి, మక్కువ, కాశీపట్నం గ్రామాలలో ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. చెడు వ్యక్తుల నుంచి ఆడపిల్లలను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం వల్ల, ఆడపిల్లలు అనారోగ్యానికి గురికావడమే కాకుండా, పుట్టే పిల్లల్లో ఎదుగుదల లోపం కనిపిస్తోందన్నారు. బాలల హక్కులు, చట్టాలు, అంగన్వాడీల ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎన్.లీలావతి, పి.రాజ్యశ్రీ, సచివాలయం, వైద్యశాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, కిశోరీ బాలికలు పాల్గొన్నారు.

విస్తారంగా పామాయిల్ సాగు

సాలూరు రూరల్: గడిచిన ఐదేళ్లలో సాలూరు మండలంలో పామాయిల్ తోటల సాగు విస్తారంగా పెరిగింది. ప్రస్తుతం మండలంలో 4 వేల ఎకరాల్లో రైతులు పామాయిల్ పంటను సాగుచేస్తున్నారు. పామాయిల్ పంట సాగు అన్ని రకాల నేలలకు అనుకూలం కావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా పామాయిల్ పంట ధరను ప్రభుత్వ నిర్ణయించి రైతుల అకౌంట్లలో నగదు జమచేస్తుండడంతో పాటు పండిన పంటను నేరుగా ఆయిల్ కంపెనీ ప్రతినిధులు స్థానికంగా సేకరిస్తుండడం రైతుల ఆసక్తికి కారణమవుతోంది. ఏటా ఉద్యాన శాఖాధికారుల లెక్కల ప్రకారం మండలంలోని 200 ఎకరాల్లో పామాయిల్ పంట అదనంగా సాగవుతోంది.

రెండు నెలల గౌరవ వేతనం బకాయి చెల్లించాలి

సాలూరు: గత రెండు నెలల బకాయి గౌరవ వేతనం చెల్లింపుకోసం చర్యలు తీసుకోవాలని సాలూరు పట్టణ వలంటీర్లు మున్సిపల్ కమీషనర్ ప్రసన్నవాణిని కోరారు. ఈ మేరకు మంగళవారం వారు మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ, పట్టణంలోని 29 వార్డుల్లో పనిచేస్తున్న సుమారు 250మంది వలంటీర్లకు రెండు నెలల బకాయి గౌరవ వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు.తమకు తక్షణమే బకాయి గౌరవ వేతనం అందించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరుతూ వినతిపత్రం అందించారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

వంగర: గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీవో సాల్మన్‌రాజ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశమైన ఆయన.. ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు మెరుగుపరచాలని, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామీణులు వాటి బారినపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

శస్త్రచికిత్సకు 34 మంది ఎంపిక

బొబ్బిలి: స్థానిక పట్టణంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 96 మంది శిబిరానికి హాజరుకాగా, వారికి వైద్యపరీక్షలు చేసిన వైద్యులు 34 మందికి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని గుర్తించారు. ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో వైద్యుడు బి.వివేక్‌వర్మ, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా మహమ్మారిని తరిమికొడదాం

- జిల్లా మలేరియా నివారణ అధికారి టి.జగన్‌మోహన్‌రావు



సీతంపేట: ర్యాలీలో డీఎంవో జగన్‌మోహన్‌రావు, వైద్యారోగ్య సిబ్బంది

సీతంపేట: మలేరియా మహమ్మారిని తరిమికొట్టాలని, ఆ దిశగా వైద్యారోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి(డీఎంవో) టి.జగన్‌మోహన్‌రావు ఆదేశించారు. మండలంలోని దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశా డే, మలేరియా వ్యతిరేక మాసోత్సవం ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే సమాజ ఆరోగ్యం సాధ్యమన్నారు. ప్రతీ గ్రామంలో ఫీవర్ సర్వే చేసి, జ్వరపీడితులను గుర్తించి, వారికి సకాలంలో వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించి, మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమలు పెరగకుండా దోమల నివారణ మందు పిచికారీ చేయించాలన్నారు. అంతకుముందు గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా జ్వరంతో బాధపడే కేసులు ఎక్కడైనా ఉన్నాయా.. మలేరియా నియంత్రణకు చేపడుతున్న చర్యలపై సమీక్షించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి భానుప్రతాప్, ఏఎంవో సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



కురుపాం: ఉదయపురంలో దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్న దృశ్యం

కురుపాం: మండలంలోని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ మంగళవారం చేపట్టారు. ఇదే సీజన్‌లో మలేరియా ప్రబలే అవకాశం ఉన్నందున పాఠశాలల పునఃప్రారంభం నాటికి వసతిగృహాలకు చేరుకునే విద్యార్థులు జ్వరాల బారినపడకుండా చర్యలు తీసుకుంటున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.ప్రజ్ఞ తెలిపారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశాలు ఉన్నాయని, వాటి బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లు, కాలువల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేసుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని, దోమతెరలు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వి.సత్యరాజ్, జె.తిరుపతిరావు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్య తప్పనిసరి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో శ్రీనివాస్, తదితరులు

భామిని: ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా కంప్యూటర్ విద్యనభ్యసించాలని ఎంఈవో ఎ.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఘనసర గ్రామంలో కలామ్ డ్రీమ్స్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో గ్రామీణ వికాస్ సంఘం ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ పొందిన 50 మందికి మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే కంప్యూటర్ నేర్చుకోవాలని, ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. 2018 నుంచి ఇప్పటివరకు 414 మందికి కంప్యూటర్ శిక్షణ ఇచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వలరౌతు ప్రసాద్, గేదెల శివకుమార్, కొనపల నీలకంఠం పాల్గొన్నారు.

గిరిజన చిత్రలేఖనంపై శిక్షణ



శిక్షణ పొందుతున్న యువకులు

సీతంపేట: మండల కేంద్రంలో వైటీసీ(యూత్ ట్రైనింగ్ సెంటర్) ఎదురుగా ఉన్న లయ అనే స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో గిరిజన చిత్రలేఖనంపై శిక్షణ ఇస్తున్నారు. గిరిజనుల జీవన విధానం, వారి సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబే చిత్రాలు గీయడాన్ని ట్రైనర్ పావని గిరిజన యువతకు నేర్పిస్తున్నారు. ఈ నెల 16వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగిస్తామని ఆమె తెలిపారు.

పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ గణపతిరావు

గరుగుబిల్లి: పశువులు సీజనల్ వ్యాధులు బారినపడకుండా పాడిరైతులు అప్రమత్తం కావాలని పశుసంవర్ధక శాఖ ఏరియా అసిస్టెంట్ డైరెక్టర్ బి.గణపతిరావు సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో ఉన్న పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమావేశమైన ఆయన.. పశువులకు వ్యాధులు సోకకుండా చేపడుతున్న చర్యలపై ఆరాతీశారు. మూగజీవాలకు టీకాలు సకాలంలో వేయాలని, గొర్రెలు, మేకలు పారుడువ్యాధి బారినపడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో వైద్యులు ఎస్.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై వరి, పచ్చిరొట్ట విత్తనాలు

- జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్



రైతులకు విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్



కొమరాడ: రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ నీలమ్మ

గుమ్మలక్ష్మీపురం: రైతులకు 90 శాతం రాయితీపై వరి, పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని రాయగడ జమ్ములో ఏవో ప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు వరి, పచ్చిరొట్ట విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన చేతులమీదుగా పలువురికి ఆయా విత్తనాలు అందజేశారు. అనంతరం ఆయన ఖరీఫ్ సాగుకు సంబంధించి, సలహాలు, సూచనలు చేశారు. వ్యవసాయం చేసే ప్రతిఒక్కరూ తొలుత నేల సారవంతాన్ని పరీక్షించుకోవాలని, భూసారం అనుగుణంగా అనువైన పంటలు వేసుకోవాలని, అలా అయితేనే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. లైసెన్స్ ఉన్న షాపుల దగ్గరే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, కొనుగోలుకు సంబంధించిన రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. పంటను చీడపీడలు, తెగులు ఆశించినప్పుడు వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఆ తర్వాత రైతు భరోసా కేంద్రంలో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.అమల, అగ్రికల్చర్ అసిస్టెంట్ పి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని ఎండభద్ర గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు వరి విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూడేసు సర్పంచ్ చోడి నీలమ్మ విచ్చేయగా, ఆమె చేతులమీదుగా పలువురు రైతులకు వరి విత్తనాలు అందజేశారు. గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా అన్నదాతలకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేయడం జరుగుతోందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

గుమ్మలక్ష్మీపురం: బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో బి.చంద్రశేఖరరావు పిల్లల తల్లిదండ్రులను కోరారు. ఇదే విషయమై మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, విద్యాసామగ్రి, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించారు. నైపుణ్యం, అనుభవం కలిగిన బోధనా సిబ్బంది ఉన్నారని, పిల్లల బంగారు భవిష్యత్ ప్రభుత్వ పాఠశాలలతో నేనని అన్నారు. తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా పిల్లలను తమకు దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

ప్రమాదాల బారినపడకుండా జాగ్రత్త వహించాలి

పాలకొండ రూరల్: ప్రమాదాల బారినపడకుండా జాగ్రత్త వహించాలని విద్యుత్ శాఖ సిబ్బందికి ఆ శాఖ ఏఈ శ్యామ్‌సుందర్ సూచించారు. స్థానిక పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆయన రానున్న వర్షాకాలంలో ఈదురుగాలులకు విద్యుత్ సంబంధిత సమస్యలు వస్తాయని, వాటికి సంబంధించి చేపట్టే మరమ్మతుల పనుల్లో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే పొలాల్లో మోటార్ ఆన్, ఆఫ్ చేసేటప్పుడు రైతులు పాటించాల్సిన జాగ్రత్త చర్యలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, పాడైన విద్యుత్ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడే వైర్లపై దృష్టిసారించాలన్నారు. సకాలంలో వినియోగదారులకు విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు.

'వెలుగు'లో ఆడిట్ రేపు

వంగర: స్థానిక వెలుగు కార్యాలయంలో ఈ నెల 13వ తేదీన ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఏపీఎం మీసాల చక్రపాణి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామైక్య సంఘాల పరిధిలోని రికార్డులను సిద్ధం చేయాలని వీవోఏలకు సూచించారు. పూర్తిస్థాయి రికార్డులతో సిబ్బంది కార్యాలయానికి హాజరు కావాలన్నారు.

10 మద్యం సీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలను చూపిస్తున్న ఎస్ఈబీ సీఐ శ్రీధర్

రాజాం సిటీ: మండలంలోని అమరాం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 10 మద్యంసీసాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు ఆకస్మిక దాడులు చేసి, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఇసుకను సీజ్ చేసి, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వాలి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

పాలకొండ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, గ్రామస్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలు వాటి బారినపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీటి నిల్వలు ఉన్నచోట, కాలువల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయించాలన్నారు. రాత్రి పడుకునే సమయంలో దోమలు కుట్టకుండా దోమతెరలు వాడేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి, జ్వరపీడితులను గుర్తించి, వారికి వెంటనే వైద్యం అందేలా చూడాలన్నారు. సమావేశంలో గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం సహాయ ఇంజినీర్ ప్రవల్లిక, ఈవోపీఆర్డీ కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి, చింతాడ, వాటపాగు గ్రామాల్లో మంగళవారం త్రైత సిద్ధాంతం భగవద్గీత ప్రచారం చేపట్టారు. ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక శ్రీకాకుళం జిల్లా కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి, త్రైత సిద్ధాంతం తెలియజేస్తూ గీతా సారాంశం వివరించే కరపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంతోష్‌కుమార్, అనంతగిరి, ఈశ్వర్‌లాల్, దుర్గారావు, గోపాలకృష్ణ, లక్ష్మి, సంతోషి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి



ఆశ కార్యకర్తలకు సూచనలిస్తున్న వైద్యుడు సంతోష్‌కుమార్

గరుగుబిల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్యుడు ఎస్.సంతోష్‌కుమార్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశా డే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆశ కార్యకర్తలు నిర్వహించాల్సిన విధులు–బాధ్యతలను వివరించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, గ్రామీణులు వాటి బారినపడకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉదయకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో గీతాంజలి

సీతంపేట: మనమంతా ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కె.గీతాంజలి తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డు, పలు వీధుల్లో మంగళవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఇంటి వద్ద గానీ ఇంటి పరిసరాల్లో గానీ మురుగునీటి నిల్వలు, చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. ఇళ్లల్లో, కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరిక కళావతి, గ్రామ కార్యదర్శి సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించండి



ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

పాలకొండ రూరల్: జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో మంగళవారం సమావేశమైన ఆయన.. ఉపాధి పనులు జరుగుతున్న తీరు, రికార్డుల నిర్వహణపై ఏపీఎం ఈశ్వరమ్మను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయించి, వేతనదారులకు గిట్టుబాటు అయ్యే వేతనం వచ్చేలా చూడాలని తెలిపారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి పయనం



బస్సు వద్ద కూటమి నేతలు, కార్యకర్తలు

భామిని: కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మండలానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు రెండు బస్సుల్లో మంగళవారం పయనమై వెళ్లారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



గొట్టివలసలో మురుగుకాలువలో పూడికలు తొలగిస్తున్న ఈవోపీఆర్డీ గోపాలరావు

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస గ్రామంలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులను ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడంతో పాటు కాలువల్లోని పూడికలు తీసివేయాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ వంటి జ్వరాలు విజృంభిస్తాయని, దోమలు పెరగకుండా కాలువలు, మురుగునీరు ఉన్న ప్రాంతాల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే తాగునీటి బోర్లు, రక్షిత మంచినీటి పథకాలు, ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోను చంద్రినాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకొండ రూరల్:

వ్యవసాయం, ఉద్యాన రంగాల్లోని రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారిణి తమ్మినేని అమరేశ్వరి కోరారు. మండలంలోని పలు గ్రామాల్లోని రైతులకు రాయితీపై అందించిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, వాటి పనితీరు, వాటిని రైతులు చూసుకునే తీరును ఆమె మంగళవారం పరిశీలించారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు ఉద్యాన పంటలు సాగు చేసేందుకు తోడ్పాటునందిస్తామన్నారు. బిందు, తుంపర సేద్యం చేపట్టేందుకు అవసరమైన యంత్రాలు, పరికరాలను రాయితీపై అందిస్తామన్నారు. అవసరమైన వారు రైతు భరోసా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆయుర్వేదం ఆరోగ్యానికి శ్రేయస్కరం

రేగిడి: ఆయుర్వేద వైద్యం ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శిబిరానికి హాజరైన వారికి ఆయన వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆయుర్వేద వైద్యంలోని అద్భుతాలను వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే శక్తి ఆయుర్వేదానికి ఉందని, ప్రతిఒక్కరూ ఆయుర్వేద మందులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ప్రసాద్, చక్రధర్, సింహాచలం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ఆయుర్వేద ఆస్పత్రుల్లో మందులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయుర్వేద వైద్యాధికారిణి ఎస్.ఉమాదేవి కోరారు. మంగళవారం స్థానిక ఆయుర్వేద ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్యసేవలు అందించిన ఆమె.. దగ్గు, చర్మవ్యాధులు, తెల్లబట్ట, కీళ్లనొప్పులు, వాతం, ఎనీమియా, గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్నిరకాల వ్యాధుల నివారణకు ఆయుర్వేద మందులు ఉన్నాయని, ఇప్పుడిప్పుడే మళ్లీ ఆయుర్వేదానికి ఆదరణ లభిస్తుండడం చాలా ఆనందంగా ఉందన్నారు.